క్లుప్తంగా

రెండు నామినేషన్లు దాఖలు

తాండూరు టౌన్: తాండూరు ఎమ్మెల్యే స్వతంత్ర్య అభ్యర్థులుగా పెద్దేముల్ మండలం కందనెల్లితండాకు చెందిన జైసింగ్, రాథోడ్ ఆనంద్ నాయక్‌లు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకు దాఖలైన నామపత్రాల సంఖ్య ఎనిమిదికి చేరింది.

వికారాబాద్‌లో ఒకటి..

వికారాబాద్ అర్బన్: వికారాబాద్‌కు చెందిన రామరాజు.. పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా పేరుతో మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు వికారాబాద్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మకు నామపత్రం సమర్పించారు.

డైవర్షన్ రోడ్డులో దిగబడిన బస్సు

ధారూరు: నగరంలోని లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభకు ప్రజలను తరలించేందుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కాగ్నానదిని దాటుతుండగా మధ్యలో దిగబడింది. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి లక్నాపూర్, సర్పన్‌పల్లి ప్రాజెక్టుల నుంచి అలుగు పారి, నీటి ప్రవాహం కాగ్నానదిలో కలిసి ప్రవహిస్తోంది. దీంతో సీసీ పైపుల మధ్య వేసిన మట్టి, రాళ్లు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో డైవర్షన్ రోడ్డును దాటే యత్నంలో బస్సు గుంతలో దిగబడింది. అటుగా వెళ్తున్న పలువురు బస్సును బయటకు తోశారు.

ఆత్మగౌరవ సభకు కదంతొక్కిన కమలనాథులు



సభకు తరలిన మారుతికిరణ్ తదితరులు

పరిగి: నగరంలోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన బీజేపీ బీసీల ఆత్మగౌరవ సభకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. బీజేపీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్ భూనేటి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీజేపీ బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తుందని, ప్రధాని మోదీ.. బీసీల రాజ్యాధికారం కోసం పాటు పడుతున్నారని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

మర్పల్లి నుంచి..

మర్పల్లి: నగరంలోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ప్రధాని మోదీ బీసీ ఆత్మగౌరవ సభకు మండలం నుంచి బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. సభకు వెళ్లిన వారిలో పార్టీ జిల్లా నాయకులు బలరాంగౌడ్, సిరిపురం సీబీఎస్ నాగయ్య, నాగరాజ్, బీజేవైఎం మండల ప్రెసిడెంట్ సంతోష్‌రెడ్డి, పార్టీ శ్రేణులు కార్యకర్తలు ఉన్నారు.

కేన్సర్‌పై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి

కుల్కచర్ల: జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ మాట్లాడారు. శారీరకంగా శ్రమించకపోవడం, త్వరగా అలసిపోవడం, ఆకలి తగ్గడం, మూత్ర విసర్జన సమయంలో నొప్పిగా ఉండటం, ఎక్కువగా బరువు తగ్గడం, చర్మంలో మార్పులు వంటివి కేన్సర్ వ్యాధికి సూచనలుగా గుర్తించాలని సూచించారు. వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శివాని, రత్నలత, విజయలక్ష్మి, యాదమ్మ, వెంకటయ్య, అంజు, సుజాత, గౌరీ, జ్యోతి, మంగమ్మ, శ్రీలత, మైభమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న శేరిరాంరెడ్డి

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సహాయ సహకారాలు అందజేస్తానని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి అన్నారు. మంగళవారం చెల్లాపూర్ గ్రామంలో హనుమాన్ దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు, పార్టీ నేతలు శేరిరాంరెడ్డి నివాసానికి వెళ్లగా.. ఆలయ నిర్మాణ కమిటీకి రూ.50వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో చెల్లాపూర్ సర్పంచ్ చంద్రయ్య, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, గ్రామస్తులు శ్రీనివాస్, తిరుపతి, బాబు, చక్రపాణి, అంజిలయ్య, చుక్కయ్య, వాసు తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు

మొయినాబాద్ రూరల్: నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి గ్రామాల్లో 2వేల మేకలు, గొర్రెలకు మంగళవారం టీపీఆర్ టీకాలు వేసినట్లు మండల పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేకలు, గొర్రెల కాపల దారులు.. అధికారుల సూచనలు, సలహాలు పాటించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

పైసలు ఇస్తేనే పనికి!



నర్సరీలో పని చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

ఉపాధి డబ్బుల కోసం కూలీల ఎదురుచూపు

- మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- సంరక్షణ లేక ఎండుతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు

పెద్దేముల్: రాష్ట్రాన్ని పచ్చదనంతో ఆహ్లాదకరంగా మార్చాలనే ఉద్దేశంతో తలపెట్టిన హరితహారం కార్యక్రమం మండలంలో నత్త నడకన కొనసాగుతోంది. మూడు నెలల నుంచి చేసిన పనులకు కూలీ డబ్బులు రాక, ఏడాది క్రితం వేసిన కూరగాయ పందిర్లకు పైసలు అందక కూలీలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. పని చేస్తేగాని పూటగడవని కూలీలు డబ్బుల కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో కూలి ఇస్తేనే పనికి వస్తామన్నట్లు వారు స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మొక్కల సంరక్షణ చూసేవారు లేక రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలు వాడిపోతున్నాయి.

నర్సరీలు ఎందుకు?

యేటా గ్రామాల్లో రూ.లక్షలు ఖర్చు పెట్టి నర్సరీలు ఏర్పాటు చేసిన మండల అధికారులు.. ఒక్కో మొక్కకు రూ.200లు వెచ్చించి, మార్కెట్ నుంచి వాటిని ఖరీదు చేసి, ప్రధాన రోడ్లకు ఇరువైపులా నాటిస్తున్నారు. దీంతో ఆ అధికారుల తీరుపై కూలీలు మండిపడుతున్నారు. పల్లెల్లో నర్సరీలు ఉండగా.. ఎలా ఎందుకు చేస్తున్నారని, ఇలా చేస్తే ఇక నర్సరీలు ఎందుకుని ప్రశ్నిస్తున్నారు. ఒక్కో మొక్క పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.7 పైగా నిధులు మంజూరు చేస్తుందని, కానీ నర్సరీల్లో పెంచుతున్న మొక్కలకు, నాటుతున్న వాటికి పొంతన లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

'కూలీ'ల సమస్య పట్టని అధికారులు

పెద్దేముల్ మండల పరిధిలో 37 గ్రామ పంచాయతీలు, 11,346 ఉపాధిహామి జాబ్ కార్డులు, పని చేసిన కుటుంబాలు 7,741 ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా జీపీల్లో నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటేందుకు, వాటి సంరక్షణకు అనేక నిధులు ఖర్చు చేస్తోంది. ఈ ఏడాది మండలంలో హరితహారం కింద లక్షా 66వేల 500 మొక్కలు నాటాలనే టార్గెట్ ఉండగా.. ఇప్పటికి వరకు సుమారు లక్షా 9వేల 910 మొక్కలు నాటినట్లు సంబంధిత అధికారుల ద్వారా తెలుస్తోంది. మండల అధికారులు మాత్రం పనులు చేయించడంపై చూపిస్తున్న శ్రద్ధ చెట్ల పెంపకం, కులీ డబ్బుల విషయంలో ఎందుకు చూపడం లేదని ప్రశ్నిస్తున్నారు.

కుటుంబం గడవటం కష్టం..

పెద్దేముల్ గ్రామంలో రెండు నెలల క్రితం రోడ్ల పక్కన చెట్లు నాటడం, వాటికి నీరు పోయడం, కొత్త వన నర్సరీలకు ప్యాకెట్లు నింపడం లాంటి పనులు చేసినా.. జులై నుంచి కూలీ డబ్బులు రాలేదని కూలీలు వాపోతున్నారు. గతంలో చేసిన పనికి కూలి ఇస్తేనే పనులకు వస్తామని వారు చెప్పడం గమనార్హం. డబ్బులు రాకుంటే తమ కుటుంబాలు ఎలా గడుస్తాయని వాపోతున్నారు. ఇదిలా ఉండగా కోటపల్లి ప్రాజెక్టు కాలువల్లో పూడిక తీయడానికి కూలీలు రావడం లేదని తెలుస్తోంది.

డబ్బులు వచ్చేలా చర్యలు



ఉపాధి కూలీ డబ్బులు ఆలస్యం అయినా వస్తాయి. ఎవరూ దిగులు చెందొద్దు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులకు ఆటంకం కలగకుండా కూలీలు పనులు చేసుకోవాలి. రోడ్ల పక్కన పెంచుతున్న మొక్కలను వందశాతం సంరక్షించేలా చర్యలు తీసుకుంటాం. అవి ఎండి పోతే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవు. నాటిన ప్రతి మొక్క బతకాలని ప్రభుత్వ లక్ష్యం.

– లక్ష్మయ్య, ఎంపీడీఓ, పెద్దేముల్ మండలం

వాట్సాప్ గ్రూపుల గోల

- మితిమీరిన సాంకేతిక పరిజ్ఞానం
- సామాజిక మాధ్యమాల్లో ప్రచార లొల్లి
- విసుగు చెందుతున్న సగటు ఓటరు



దౌల్తాబాద్: సాధారణ ఎన్నికల వేళ సాంకేతిక పరిజ్ఞానం మితిమీరి పోతోంది. సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ఎక్స్, ఫేస్‌బుక్‌లలో ప్రచార గోల విపరీతంగా పెరిగిపోయింది. ముఖ్యంగా వాట్సప్‌ల్లో వస్తున్న పోస్టులతో సగటు ఓటరుకు విసుగు పుట్టిస్తోంది. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఊరూరా ప్రచార రథాలతో ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నప్పటికీ.. గడువు తక్కువగా ఉండడంతో ఓటర్లందరినీ కలవటం అసాధ్యం. అందుకే సామాజిక మాధ్యమాల ద్వారా ఓటర్లకు దగ్గరయ్యేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే పట్టణాలు, గ్రామాల్లో వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసి, సోషల్‌మీడియా ద్వారా ప్రచార చిత్రాలు, లఘు వీడియోలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ.. ప్రచారం ముమ్మరం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రాష్ట్ర జిల్లా స్థాయిలో ప్రత్యేకంగా సోషల్‌మీడియా సైన్యం పనిచేస్తుండగా.. ఆ పార్టీల అభ్యర్థులు వ్యక్తిగతంగా బృందాలను రంగంలోకి దింపారు. సొంత పార్టీ హామీలు, ప్రత్యర్థుల ఆరోపణలు తిప్పికొట్టేలా నిత్యం చేపడుతున్న ప్రచారానికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు రూపొందించేందుకు ప్రత్యేకంగా ఏజెన్సీలు, యూట్యూబ్ ఛానళ్ల ద్వారా ఒప్పందం కుదుర్చుకుని సోషల్ మీడియా ప్రచార వ్యూహకర్తలకు రూ.లక్షలు చెల్లిస్తున్నారు.

చూడలేక, చదవలేక..

ఎన్నికల ప్రచారానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న చిత్రాలు, వీడియోలు ఓటర్లకు ఇబ్బందిగా మారాయి. వాటిని చదవక లేక, చూడలేక విసుగు చెందుతున్నారు. ఏ వాట్సప్ గ్రూపు తెరిచినా.. ఇబ్బడిముబ్బడిగా పోస్టులు కనిపిస్తున్నాయి. ఇష్టం లేకున్నా వాటిని చూడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నట్లు సమాచారం. అంతే కాకుండా ఒకే గ్రూపులో ఒకే పార్టీకి అనుకూలంగా, వ్యతిరేకంగా పోస్టులు పెడుతుండడంతో ఓటర్లు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓటర్లను తొందరగా ఆకట్టుకునే యత్నంలో డిజిటల్ ప్రచారానికి మొగ్గచూపుతున్న నేతలు.. ఓటర్ల ఇబ్బందిని పరిగణనలోకి తీసుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పదైనా మోగని బడిగంట

- సమయ పాలన పాటించని ఉపాధ్యాయులు
- బడి ప్రాంగణంలోనే విద్యార్థుల నిరీక్షణ



బడి బయటే కూర్చున్న విద్యార్థులు

పరిగి: విద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతూ.. వారికి ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విధినిర్వహణలో సమయపాలన పాటించకపోవటమే కాకుండా, ప్రశ్నించిన వారికి దురుసుగా సమాధానం ఇస్తున్నారు. పరిగి మండలం రాపోల్ ప్రాథమిక పాఠశాలలో నిత్యం జరుగుతున్న తంతు ఇది. మంగళవారం కూడా అదే జరిగింది. ఉదయం 10 గంటలు అయినా పాఠశాల గదికి తాళం తీయలేదు. దీంతో విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో కూర్చున్నారు. ఉదయం 9.30 గంటలకు సిబ్బంది విధులకు వచ్చి, విద్యార్థులచే ప్రార్థన చేయించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ ఇవేమీ జరగడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నిలదీస్తే మరోచోట పనిచేస్తం..!

పాఠశాలలో మొత్తం 80 మంది విద్యార్థులు ఉండగా, నలుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో ఒకరు సుదీర్ఘకాలం సెలవులో ఉండి, ముగ్గురు మాత్రమే పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఉదయం అల్పాహారం కూడా టైంకు వడ్డించడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. ఇదే అంశంపై విద్యార్థుల తల్లిదండ్రులు టీచర్లను ప్రశ్నించగా 'మమ్మల్ని ఇలా నిలదీస్తే ఎలా? ఇక్కడ కాకపోతే మరోచోట పనిచేసుకుంటాం. మాకు రావాల్సిన జీతం వస్తుంది' అంటూ దురుసుగా సమాధానం ఇస్తున్నారని చెప్పారు. ఇదే విషయమై మండల విద్యాధికారి హరిశ్చందర్‌ను వివరణ కోరగా.. నలుగురు సిబ్బందిలో ఒకరు లీవులో ఉన్నారని, ముగ్గురు పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. వారు విధులకు సక్రమంగా రాకపోతే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే, తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇంటింటికీ సంక్షేమం

- అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు
- హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం
- మరోసారి నమ్మి మోసపోవద్దు
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు



మోమిన్‌పేట: ప్రచారం చేస్తున్న నరోత్తంరెడ్డి

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతాయని, అర్హులందరికీ ఆరు గ్యారంటీలు ఇస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి ఎన్కేపల్లి గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగానే తెలంగాణలో కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమయిందని ఆరోపించారు. ఆ పార్టీని నమ్మి మరోసారి మోసపోవద్దని, చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, నాయకులు సురేందర్, చంద్రయ్య, సుభాష్‌గౌడ్, మానయ్య, మహంత్‌స్వామి, ఆసిఫ్, నర్సింహులు, ప్రతాప్‌రెడ్డి, చంద్రయ్య గౌడు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రేషన్ కార్డు రాలేదు..

ధారూరు: బీఆర్ఎస్ పాలనలో ఎవరికీ కొత్తగా రేషన్‌కార్డు రాలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పట్లోళ్ల రాములు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ధారూరు మండలం కుక్కింద గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు.

పార్టీలకు అతీతంగా..

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మార్కెట్ వైస్ చైర్మన్ రామేశ్వర్, పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దివాకర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు మండల కేంద్రంలో పర్యటించారు. పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. పార్టీ అధికారం చేపడితే అందరికీ మేలని, చేతి గుర్తుకు ఓటేసి వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసి, జిల్లా నాయకులు రాములు, నగేష్, బీసీసెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, నర్సింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: సబ్బండ వర్గాలకు మేలు చేకూరాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా అంతారం గ్రామంలో పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఇందులో సర్పంచ్ కృష్ణ, కుమ్మరి స్వామి, కృష్ణయ్య, సాయన్న, రమేష్, భరత్‌కుమార్ ఉన్నారు.



ధారూరులో నేతల ప్రచారం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మొయినాబాద్: ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పరిశీలించారు. సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి, ఎత్‌బార్‌పల్లి, నక్కలపల్లి, తోలుకట్ట, అప్పారెడ్డిగూడ, సజ్జన్‌పల్లి, కనకమామిడి, హిమాయత్‌నగర్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి, గదుల నిర్వహణ, పోలింగ్‌స్టేషన్ నంబరింగ్, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, టాయిలెట్స్, ఫర్నిచర్ తదితర సౌకర్యాలను పర్యవేక్షించారు. ఆయన వెంట ఆర్ఐ చంద్రమోహన్, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ ఉన్నారు.



పూడూరు: ప్రచార రథం పై నుంచి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కొడంగల్ రూరల్: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

పదేళ్లలో ఎనలేని అభివృద్ధి

- పార్టీకి సంక్షేమ పథకాలే రక్ష
- నీరాజనం పడుతున్న ప్రజలు
- మూడోసారి విజయం ఖాయం
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు

పూడూరు: ఉమ్మడి రాష్ట్రంలో జరగని అభివృద్ధి ఈ పదేళ్లలో తెలంగాణలో కనీవిని ఎరగని విధంగా వృద్ధి చేసి చూపిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ పరిగి సెగ్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పూడూరు మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామ రక్ష అని, బీఆర్ఎస్‌కు ప్రజలు గ్రామగ్రామాన నీరాజనం పడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ పథకాలను కాపీకొట్టి, వారంటీలేని గ్యారంటీలతో కాంగ్రెస్ నాయకులు ఓట్లకోసం వస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల అనీల్‌రెడ్డి, అర్చనారెడ్డి, ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ మేఘమాల, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజారుద్దీన్, రైతు సమన్వయ సమితీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు అజీమోద్దీన్, రాంరెడ్డి, నర్సింహారెడ్డి, రహీస్‌ఖాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం..

కొడంగల్ రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని బీఆర్ఎస్ కొడంగల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా గాంధీనగర్‌లో ఆయన పర్యటించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు అధికార పార్టీలో చేరగా.. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నీటూరు బసమ్మ, ఆశమ్మ, పద్మ, తిరుపతమ్మ, సరోజ, పద్మమ్మ, అంజమ్మ ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్‌బాబు, అంబేడ్కర్ సంఘం నాయకులు రమేష్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి పట్టం కట్టండి

ధారూరు: ప్రజా సంక్షేమానికి పాల్పడిన బీఆర్ఎస్‌కు మరోసారి పట్టం కట్టాలని పార్టీ ధారూరు మండల నాయకులు కోరారు. మండల పరిధి నాగారంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నిరంతరం ప్రజల గురించి ఆలోచించే ముఖ్యమంత్రి కేసీఆర్, వికారాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌ను మరోసారి ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

పార్టీలో చేరిక

దౌల్తాబాద్: మండల పరిధి అంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు సుమారు 30మంది ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఇందులో సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ రాజు తదితరులు ఉన్నారు.

కారు గుర్తుకు ఓటు వేసి..

మర్పల్లి: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు.. ఇక ముందు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి, బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, జెడ్పీటీసీ పబ్బే మధుకర్ కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా వారు మైనార్టీ, బీసీ కాలనీల్లో పర్యటించారు. ఇందులో మార్కెట్ డైరెక్టర్ గౌస్, టౌన్ ప్రెసిడెంట్ గఫార్, ఎంపీటీసీ వసంత్ ఉన్నారు.

అందరికీ ప్రాధాన్యత

వికారాబాద్ అర్బన్: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేది కేవలం బీఆర్ఎస్ పార్టేనని ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్ అన్నారు. ఎంఐజీ కాలనీకి చెందిన పలువురు కౌన్సిలర్ కృష్ణారెడ్డి, రామయ్యగూడ కౌన్సిలర్ కొండేటి కృష్ణల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరగా.. వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ కోసం పనిచేయం..



మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి

బషీరాబాద్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా వేధించిన కాంగ్రెస్ పార్టీకి తాము మద్దతు ఇవ్వమని వైఎస్సార్ టీపీ రాష్ట్ర కార్యదర్శి బుస్స రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్ టీపీకి రాజీనామా చేశారు. అనంతరం మాట్లాడారు. ఇంతకాలం షర్మిలను నమ్ముకొని పార్టీ కోసం పనిచేశామని తెలిపారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ కోసం పనిచేసే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డిని పెట్టిన ఇబ్బందులను తాము ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. చంద్రబాబునాయుడు తెలంగాణలో రేవంత్‌రెడ్డిని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రేవంత్‌రెడ్డి.. బాబుకు మేలు చేసేందుకే పనిచేస్తాడని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు రేవంత్‌ను నమ్మొద్దని సూచించారు. ఇకనుంచి తాను తెలంగాణ తెచ్చిన కేసీఆర్ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా వైఎస్సార్ అభిమాని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, వైస్ ఎంపీపీ శంకర్‌రెడ్డి సైతం బీఆర్ఎస్‌లో చేరారు.

బీసీవై అభ్యర్థిగా రాంచందర్

బంట్వారం: భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా కోట్‌పల్లి మండలం బార్వాద్‌కు చెందిన ధర్మపురం రాంచందర్ యాదవ్ పోటీ చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ చేతుల మీదుగా బీఫాం అందుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడారు. 9వ తేదీన తాండూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామ పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

పాము కాటుకు ఆవు మృతి

బంట్వారం: పాము కాటుతో ఆవు మృతి చెందిన సంఘటన మంగళవారం మండల పరిధి బస్వాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మహిళా రైతు రోజమ్మ రోజులాగే తన ఆవును మేతకు వదిలి, పొలంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయింది. పొలం గట్టుపై మేత మేస్తున్న ఆవుకు పాము కాటు వేయడంతో అది అక్కడికక్కడే మృతి చెందింది. కొద్ది సేపటికి గమనించిన రోజమ్మ బోరున విలపించింది. రూ.70 వేలు నష్టం వాటిల్లిందని, బీమా అందజేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులను వేడుకున్నారు.

నేడు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు చివరి తేదీ

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు

తాండూరు టౌన్: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే వారు దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం చివరి రోజు అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫారం–12డి పూర్తి చేసి సాయంత్రం 5గంటల లోగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. 80 ఏళ్ల వయసు గల వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు, అత్యవసర సేవలు అందించే ప్రభుత్వ శాఖలైన వైద్య, ఆరోగ్య, విద్యుత్, సమాచార పౌర సంబంధాల, రైల్వే, పోస్టల్ శాఖలతో పాటు కోవిడ్ దీర్ఘకాలిక బాధితులు.. తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చని సూచించారు. ఫారం–12డి దరఖాస్తు చేసుకున్న ఓటర్లు, ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ సిబ్బంది, పోలీసు సిబ్బందిని వారి ఇళ్ల వద్దకు పంపి బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును తీసుకుంటారన్నారు. ఇందుకు కోసం ఇప్పటి వరకు 14 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్‌ఓ తెలిపారు.

అన్యాయం చేశారు..

కొడంగల్ రూరల్: భారతీయ జనతా పార్టీ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కూర వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 40ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్నానని, పార్టీ పిలుపు మేరకు ఎన్నో ఉద్యమాలు చేశానన్నారు. ఒకసారి 3 రోజుల పాటు నిరాహార దీక్ష చేశానని చెప్పారు. ఇంత క్రియాశీలకంగా పనిచేసిన తనకు టికెట్ ఇవ్వకపోవడం బాధగా ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల మద్దతు ఉన్న వారికి టికెట్ కేటాయించేలా పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకోవాలని కోరారు.